
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శనివారం, 6 ఏప్రిల్ 2024



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	42.3	25
భద్రాద్రి	43.4	28

రంజాన్‌వేళలు



ఇఫ్తార్ (సా) : 6:28 (శనివారం)
సహర్ (ఉ) : 4:36 (ఆదివారం)

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్



ఇరు జిల్లాల్లో ఉష్ణోగ్రతల తీరు..

తేది	ఖమ్మం	భద్రాద్రి
ఏప్రిల్ 1	41.0	40.0
ఏప్రిల్ 2	43.2	42.8
ఏప్రిల్ 3	40.8	41.1
ఏప్రిల్ 4	40.7	41.7
ఏప్రిల్ 5	42.3	43.4

ఎండ ప్రచండం

- భద్రాచలంలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉదయం పది గంటలు దాటితేచాలు కాలు బయటపెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గడిచిన ఐదురోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలిచింది. వాతావరణశాఖ శుక్రవారం ప్రకటించిన ఉష్ణోగ్రతల్లో రాష్ట్రంలో అత్యధికంగా 43.5డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదుకాగా.. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 43.4 డిగ్రీలు నమోదై ద్వితీయస్థానంలో నిలిచింది. వాతావరణశాఖ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందంటూ హెచ్చరించిన క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. ఇక ఖమ్మం జిల్లాలో అత్యధికంగా కూసుమంచిలో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే గతేడాది ఇదే సమయానికి ఖమ్మం జిల్లాలో 38.6 డిగ్రీలు, భద్రాద్రి జిల్లాలో 39.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం.ఖమ్మం జిల్లాలో సాధారణంగా 38.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా 40.4డిగ్రీలు నమోదవుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో 38.9 సాధారణ ఉష్ణోగ్రతలు కాగా.. ప్రస్తుతం 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా నమోదవ్వాల్సిన సాధారణ ఉష్ణోగ్రతలు కంటే సగటున 1.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ ప్రారంభంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ముందు పరిస్థితులపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అతడు... బతుకుదెరువు కోసం పరాయి రాష్ట్రం నుంచి ఖమ్మం వచ్చాడు... ఇక్కడే పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపుతున్నాడు.. ఇటీవల పనులు లేక ఆదాయం తగ్గింది. తీసుకున్న ద్విచక్రవాహనం వాయిదా చెల్లింపు ఆలస్యమైంది. అదే అతడికి ముప్పుగా మారింది. డబ్బులు ఎందుకు కట్టడం లేదని ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వచ్చి దాడికి దిగడంతో.. తీవ్ర భయానికి లోనైన సదరు యువకుడు వారినుంచి పారిపోతూ చెరువులోకి దూకాడు. ఈత రాకపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాకు చెందిన వినయ్(20)గా గుర్తించారు. ఫైనాన్స్ వ్యాపారులు బకాయిల రికవరీ కోసం ఎలా అమానుషంగా ప్రవర్తిస్తున్నారో ఈ సంఘటన కళ్లకు కడుతోంది. ఖమ్మం నగరంలో శుక్రవారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.



వినయ్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో)

ప్రాణం తీసిన 'ఫైనాన్స్'

వాయిదాలు చెల్లించలేదని మార్బుల్ కార్మికుడిపై దాడి

- రాళ్లతో వెంటపడిన రికవరీ ఏజెంట్లు
- ప్రాణభయంతో చెరువులో దూకిన యువకుడు
- ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతి
- మృతుడు యూపీలోని ఆగ్రా వాసి

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 5: ఖమ్మం నగరంలో దారుణం చోటు చేసుకుంది. ఫైనాన్స్ ఏజెంట్ల రాక్షసత్వానికి ఓ యువకుడు బలైపోయాడు. బైక్ లోన్ తీసుకొని వాయిదాల చెల్లింపుల్లో జాప్యం చేయడంతో ఫైనాన్స్ ఇచ్చిన ఏజెంట్లు యువకుడిపై దాడికి దిగారు. ప్రాణ భయంతో పారిపోతుండగా రాళ్లు పట్టుకొని వెంబడించారు. దీంతో యువకుడు సమీపంలో వున్న చెరువులో దూకి, ఈతరాకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ఉత్తరప్రదేశ్ నుంచి మార్బుల్ పని కోసం వచ్చిన కార్మికుడు వినయ్(20)గా గుర్తించారు. అప్పు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాల్సి ఉన్నా... వాటిని పట్టించుకోకుండా ఫైనాన్స్ యజమానులు వసూళ్ల కోసం ఆటవిక పద్ధతులను అవలంబిస్తున్నారు. దీంతో బాధితులు ప్రాణాలు వదిలేస్తున్నారు. ఇందుకు ఖమ్మంలో జరిగిన సంఘటనే నిదర్శనంగా నిలిచింది. సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాకు చెందిన వినయ్(20), అతడి స్నేహితుడు అజయ్ ఠాగూర్ మార్బుల్ పనులు చేయడానికి కొంత కాలం క్రితం ఖమ్మం వచ్చారు. నగర పరిధిలోని దానావాయిగూడెంలో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం ఇద్దరు స్నేహితులు నగరంలోని మోహన్ సాయి సెకెండ్ హ్యాండ్ ఫైనాన్స్ సంస్థ నుంచి రెండు బైక్‌లను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి కొద్ది నెలలు ఈఎంఐలు చెల్లించారు. వినయ్ రూ.4500, అజయ్ ఠాగూర్ రూ.14500 ఈఎంఐలు ఇంకా చెల్లించాల్సి ఉంది.

దీంతో ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లయిన శీలం అజయ్‌కుమార్, దరావత్ రాంచందర్ శుక్రవారం దానవాయిగూడేనికి వెళ్లారు. అజయ్ కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లడంతో.. అతడి ద్విచక్రవాహనం ఎక్కడుందని వినయ్‌ను అడిగారు. బల్లేపల్లిలోని ఒకరికి అజయ్ ఠాగూర్ అప్పు ఉన్నాడని, అది చెల్లించకపోవడంతో వారు బైక్‌ను తీసుకువెళ్లారని తెలిపాడు. వెంటనే వినయ్‌ను తీసుకుని ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు బల్లేపల్లికి వెళ్లారు. అక్కడ ద్విచక్రవాహనం తీసుకెళ్లిన వారితో గొడవ జరిగింది. ఈ క్రమంలో ఏజెంటు అయిన రాంచందర్ కర్రతో వినయ్‌ను కొట్టాడు. దీంతో వినయ్ భయంతో అక్కడి నుంచి పారిపోతుండగా రికవరీ ఏజెంట్లు వెంబడించారు. చెరువు వైపు వెళుతుండగా ఏజెంట్లలో ఒకరురాయి తీసుకుని వెంటపడ్డాడు. దీంతో భయంతో ఎటూ తప్పించుకోలేక.. వినయ్ చెరువులో దూకాడు. ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు.

విషయం తెలిసిన ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు శీలం అజయ్ కుమార్, దరావత్ రాంచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై తోటి మార్బుల్ కార్మికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు మృతుడిని రాళ్లతో వెంబడించిన దృశ్యాలు సమీపంలోని ఓ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఆ సీసీ ఫుటేజీ కేసుకు కీలకంగా మారింది. మృతుడు అవివాహితుడు. ఘటన సమాచారాన్ని పోలీసులు మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. శనివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించనున్నారు.

శ్రీరామ నవమికి 250 క్వింటాళ్ల తలంబ్రాలు

- భక్తులకు అందుబాటులో సెక్టార్ టికెట్ల అమ్మకాలు
- వీవీఐపీ సెక్టారుకు రూ.10 వేలు, వీఐపీ సెక్టారుకు రూ.5 వేలు
- భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి

4





సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

4

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్ష

మడుపల్లి హెచ్‌ఎం సస్పెన్షన్

మధిర రూరల్, ఏప్రిల్ 5: మధిర మండలం మడుపల్లిలోని జడ్పీఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాట్ల సాధు సమాధానంను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం సస్పెండ్ చేశారు. మడుపల్లి పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించినట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మార్చి 31న అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు జైలుకు రిమాండ్ చేశారు. ఈ క్రమంలో సర్వీసు నిబంధనల ప్రకారం హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు వేశారు.

బీఆర్‌ఎస్ సమావేశంలో హెచ్‌ఎం

- సి-విజిల్ ద్వారా ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

4

చలో 'తుక్కుగూడ'

- హైదరాబాద్‌లో నేడు కాంగ్రెస్ 'జన జాతర' బహిరంగసభ
- ఉమ్మడి జిల్లా నుంచి 25 వేల మంది సమీకరణ
- శ్రేణులను సమాయత్తం చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు



ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ఎన్నికల మేనిఫేస్టోతో పాటు తెలంగాణ మోడల్ పాలన ప్రగతిని వివరించేందుకు పలు అంశాలతో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనజాతర సభకు ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు శనివారం హైదరాబాద్ తరలనున్నాయి. తుక్కుగూడ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 25వేల మంది సమీకరణ జరపాలని పార్టీ నేతలు నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిలు జనజాతరకు వాహన సదుపాయాలు కల్పిస్తున్నారు.

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లా నుంచి జనసమీకరణపై కేడర్‌కు దశ, దిశ నిర్దేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నేతలకు జనసమీకరణపై ఆదేశాలు ఇచ్చారు. అలాగే తన సొంత నియోజకవర్గం మధిర నుంచి అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్లు, జీబులు, బస్సులు, వ్యాన్ల ద్వారా నాయకులు, కార్యకర్తలు తరలనున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ మొదటి సారి జనజాతర పేరుతో సభ నిర్వహించనుంది. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతోపాటు రాహుల్ గాంధీ తదితరులు హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఉదయం నుంచి బయలుదేరి తుక్కుగూడ సభకు మధ్యాహ్నం 3గంటలకల్లా చేరాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్యలు ఇప్పటికే పిలుపునిచ్చారు.



తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్షిస్తున్న సురేంద్రమోహన్

4

తాగునీటి ఎద్దడి తలెత్తవద్దు..

- ముందస్తు చర్యలు తీసుకోవాలి
- 10న రాష్ట్రస్థాయి సమావేశం
- సమస్యలను నివేదించాలి : ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్




బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

జగ్జీవన్‌రామ్ బాటలో ముందుకు...

- దేశ అభివృద్ధిలో ఆయనది కీలకపాత్ర
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాబూ జగ్జీవన్‌రామ్ బాటలో ముందుకు పోదామని, దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని, ఆయన ఆలోచన విధానాలు ఆదర్శవంతమైనవని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య పటిష్టతకు, అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహా నాయకుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ బీజేపీ పాలనలో దేశం రకరకాల అసమానతలు, వ్యత్యాసాలతో విచ్ఛిన్నమై పోతోందని, అటువంటి వ్యత్యాసాలు లేకుండా బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా అంతా ఐక్యంగా కలిసి పయనిద్దామన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్, గిడ్డంగులు సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతోపాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి, కిన్నెరసాని వంటి నదులు, మరోవైపు నాగార్జునసాగర్‌తో కృష్ణా జలాలతో జల సంపద ఉన్నా ఉమ్మడి జిల్లా వ్యవసాయ రంగం వరుణదేవుడి దయతోనే ముడిపడి నడుస్తోంది. వానాకాలం సాగు కళ కనిపిస్తుండగా, వేసవి రాగానే వెలవెలబోతోంది. పొరుగున ఉన్న ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి జలాలతో మూడు పంటలు పండే పరిస్థితి ఉండగా, పక్కనే ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయం సాగు కష్టాలతో కన్నీటి బాధలు తెప్పిస్తోంది.



నీరు లేక ఎండుతున్న చెరువులు

ఒడిదొడుకుల వ్యవసాయం

వరుణుడి కరుణపైనే ఉమ్మడి జిల్లా సాగు

- వానాకాలంలో కళకళ... వేసవి వస్తే వెలవెల...
- ఎండిపోతున్న పంట చేలు
- పెట్టుబడులు రాక కుదేలవుతున్న అన్నదాత
- వేసవిలో సాగర్ జలాలు రాక బీళ్లుగా మారిన పొలాలు
- పూర్తిస్థాయిలో ఉపయోగపడని గోదావరి జలాలు
- సీతారామ ప్రాజెక్టు పూర్తయితేనే రైతాంగానికి ఊపిరి

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండి నీటి నిర్వహణ సక్రమంగా ఉంటేనే పంటలు పండుతున్నాయి, లేకుంటే వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటచేలు మధ్యలోనే ఎండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 10లక్షల ఎకరాల వ్యవసాయ భూమిఉంటే, వానాకాలంలో మాత్రమే ఇటు ప్రాజెక్టులు, చెరువులు, కాలువలతోపాటు ఆకాశవాయు కింద వరి, పత్తి, మిర్చి, పెసర, కంది, జొన్న, మినుము వంటి ఆహార, వాణిజ్య పప్పు ధాన్యాలు, కూరగాయల పంటలు సాగవుతున్నాయి.

వర్షాకాలం వస్తే భూమికి పచ్చని పంటలతో పచ్చలహారంలా తోటలు కనిపించే పరిస్థితి ఉండగా, ఫిబ్రవరి నాటికి పొలాలన్నీ బీడు బారుతున్నాయి. సాగర్‌లో నిండా నీరు ఉంటేనే వేసవిలో సాగర్ ఆయకట్టు పండుతుంది. ఈ ఏడాది సాగర్ జలాలు వేసవి పంటకు విడుదల చేయకపోవడంతో లక్షా 50వేలకు పైగా ఎకరాల ఆయకట్టు వెలవెలబోతోంది. వర్షాకాలంలో ఉమ్మడి జిల్లాలో సుమారు మూడున్నర లక్షల ఎకరాల వరి, మరో మూడు లక్షల ఎకరాల్లో పత్తి, లక్షన్నర ఎకరాల్లో మిర్చి పంటలు సాగవుతుండగా, మిగిలినవి పప్పుధాన్యాలు, పండ్లతోటలు, కూరగాయల సాగుతో జిల్లాలో బహుళ రకాలు సాగవుతున్నాయి. ఇటు పండ్ల తోటలు, ఇటు వ్యవసాయ

మిగతా 4వ పేజీలో...


పాలేరు జలాశయం నీటిమట్టం పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్ సురేంద్ర మోహన్, కలెక్టర్ గౌతమ్

తాగునీటి ఎద్దడి తలెత్తవద్దు..

ముందస్తు చర్యలు తీసుకోవాలి

- 10న హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశం
- సమస్యలను వెంటనే నివేదించాలి
- ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్
- మే నెలలో మరోసారి సాగర్ జలాలు విడుదల చేయాలి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 5: 'జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తొద్దు... దీని కోసం ఎక్కడ సమస్య ఉందో గుర్తించండి... దానికి అనుగుణంగా చర్యలు చేపట్టండి...!' అని ఉమ్మడి ఖమ్మం జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్‌తో కలిసి, మిషన్‌భగీరథ, మునిసిపల్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలన్నారు. ఎక్కడెక్కడ సమస్య ఉందో గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాపై వస్తున్న వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో తాగునీటి సరఫరాపై సమావేశం ఉన్నట్లు, ఆ సమావేశంలో జిల్లాకు కావాల్సిన నీటి విడుదలపై చర్యలు తీసుకోనున్నట్టు ఆయన అన్నారు. రాష్ట్రస్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లాలో తాగునీటి సరఫరాపై వివరించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా లేనిచోట స్థానికంగా వ్యవసాయ బావులు నీటి వనరులు అద్దెకు తీసుకుంటున్నామన్నారు. హ్యాండ్ పంప్ విడి భాగాలు గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో నీటి పరీక్షలకు క్లోరోస్కోప్‌లు అందించామన్నారు. ప్రతి మండలంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈఈలు రోజు తాగునీటి సరఫరా పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు.

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో 1,00, 704 గృహాలకు 69 ఎంఎల్డి ప్రస్తుతం డిమాండ్ ఉన్నట్టు తెలిపారు.

'పాలేరు' నీటిమట్టం పరిశీలన

కూసుమంచి: ఉమ్మడి ఖమ్మంజిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ శుక్రవారం ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి పాలేరు జలాశయం వద్ద నీటినిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈబీ సీఈ విద్యాసాగర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాగర్ నుంచి ఇన్‌ఫ్లో ఎంతవస్తుంది, ప్రస్తుతం పాలేరు నీటిమట్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎడమకాల్వపై రంగుల బ్రిడ్జిని, ఎస్కేప్ లాకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగర్ నుంచి పాలేరు జలాశయానికి 2 టీఎంసీల నీటిని కేటాయించారని, ప్రస్తుత నీటిమట్టం 11 అడుగులకు చేరుకుందని తెలిపారు. మరో 0.5 టీఎంసీల నీటికోసం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో మూడునెలలపాటు తాగునీటి అవసరాలకు కొరతరాకుండా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో గణేష్, ఇరిగేషన్ ఈఈలు మంగళపూడి వెంకటేశ్వర్లు, అనన్య, పుష్పలత, వాణిశ్రీ తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

మధిర మునిసిపాలిటీలో 6203 ఇంటి కనెక్షన్లకు 5.46 ఎంఎల్డి, సత్తుపల్లి మునిసిపాలిటీలో 6235 ఇంటి కనెక్షన్లకు 5.75ఎంఎల్డి, వైరా మునిసిపాలిటీలో 9054 ఇంటి కనెక్షన్లకు 5.32ఎంఎల్డి తాగునీటి సరఫరా డిమాండ్ ఉందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఆవశ్యకత వస్తే, జిల్లాలో గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో 600కు పైగా ట్యాంకర్లు ఉన్నాయన్నారు. పాలేరు రిజర్వాయర్ ద్వారా జూన్ వరకు తాగునీటి సరఫరా కోసం 1.74 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని, ప్రస్తుతం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి వదులుతున్న నీటికి అదనంగా మే నెలలో మరో టీఎంసీ నీరు అందిస్తే తాగునీటి సమస్య ఉండదన్నారు. వైరా రిజర్వాయర్‌కు జూన్ వరకు తాగునీటి అవసరాలకు 0.87 టీఎంసీ నీటి అవసరం ఉందని, నాగార్జున సాగర్ నుంచి మే చివరి వారంలో 0.31 టీఎంసీ నీటి సరఫరా చేస్తే సమస్య ఉండదన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాస్, నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న పాలేరు నీటిమట్టం

పాలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. మూడురోజులక్రితం 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికిగాను 5.5 అడుగులకు చేరి వెలవెల బోయిన సంగతి తెలిసిందే. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో సాగర్ జలాలు విడుదల చేశారు. జిల్లా తాగునీటి అవసరాల నిమిత్తం రెండు టీఎంసీల నీటిని పాలేరుకు కేటాయించారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్ నుంచి 5,400 క్యూసెక్కులనీరు పాలేరు చేరుతోంది. శుక్రవారం రాత్రికి 12 అడుగులకు చేరుకోగా, శనివారం ఉదయానికి 13అడుగులు దాటే అవకాశం ఉంది.

ఖమ్మం మున్నేరుకు సాగర్ జలాలు

పాలేరు జలాశయం నుంచి ఖమ్మం మున్నేరుకు సాగర్ జలాలను విడుదల చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పాలేరు నుంచి అధికారులు శుక్రవారం సాయంత్రం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఐబీ అధికారులు తెలిపారు.

శ్రీరామనవమికి 250 క్వింటాళ్ల తలంబ్రాలు

- భక్తులకు అందుబాటులో సెక్టార్ టికెట్ల అమ్మకాలు
- వీవీఐపీ సెక్టారుకు రూ.10 వేలు, వీఐపీ సెక్టారుకు రూ.5 వేలు
- భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, ఏప్రిల్ 5: శ్రీరామనవమికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 250క్వింటాళ్ల తలంబ్రాలను పంపిణీకి సిద్ధం చేస్తున్నామని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. భద్రాచలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కల్యాణం, పట్టాభిషేకం తిలకించేందుకు వచ్చే భక్తులకు సెక్టార్ టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో, పట్టణంలోని కౌంటర్లలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్యక్ష, పరోక్ష సేవల టికెట్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. పరోక్ష సేవా టికెట్లు తీసుకున్న వారి గోత్ర నామాలతో పూజలు నిర్వహిస్తామని అన్నారు. శ్రీరామనవమి రోజున 60 కౌంటర్ల ద్వారా తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతి బస్సులో ఒక కిలో తలంబ్రాలు అందుబాటులో ఉంచుతున్నామని, ఆన్‌లైన్‌లో కూడా తలంబ్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఇప్పటికే ముత్యాల తలంబ్రాలు పోస్టల్ శాఖ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నామని, త్వరలో ఆర్టీసీ ద్వారా భక్తుల ఇంటి వద్దకే తలంబ్రాలు అందించనున్నట్లు తెలిపారు. కల్యాణం రోజున 2.50 లక్షల లడ్డూలను భక్తులకు సులభంగా తీసుకునే విధంగా అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కలెక్టరు ఆదేశాల మేరకు కల్యాణం టికెట్లు వీవీఐపీ సెక్టారుకు రూ.10 వేలు, వీఐపీ సెక్టారుకు రూ.5 వేలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యక్షంగా వీక్షించే వీలు కాని వారికి పరోక్షంగా వీక్షించే సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఇరిగేషన్, గ్రామ పంచాయతీ, దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

9వ తేదీన అంకుర్పాన

13వ తేదీన పంచమి నాడు శ్రీరామనవమికి అంకురార్పణ జరగాల్సి ఉండగా.. 9వ తేదీన పాడ్యమి ఉగాది రోజున అంకురార్పణ జరుగుతుందని స్థానాచార్యులు కేఈ స్థలశాయి తెలిపారు. కల్పవృక్ష వాహనంలో ఉన్న మొత్తం 12వాహనాల్లో కూడా స్వామికి సేవ జరిగేలా చూస్తామన్నారు. కల్యాణాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఈవో రమాదేవి కోరారు. భక్తులకు సేవలందించేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- ధర్నాచౌక్‌లో సత్యాగ్రహ దీక్ష

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదని, వారికిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగర పరిధిలోని కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో శుక్రవారం సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈసందర్భంగా తాండ్ర వినోదరావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేముందు రైతుల సమస్యలు తీరుస్తామని మాటలు చెప్పి ఇప్పుడు రైతులను మోసపెడుతుందన్నారు. వ్యవసాయాన్ని అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దెబ్బతీస్తే ఇప్పుడు కాంగ్రెస్ కూడా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. పంటలు ఎండి రైతులు అవస్థలు పడుతుంటే ఒక యాక్షన్ ప్లాన్ ఇవ్వకుండా రాజకీయంచేయడం అన్యాయమని, రైతుల పక్షాన బీజేపీ అండగా ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయంకు డిమాండ్ పెరిగింది కాబట్టి ఇక్కడ పామాయిల్, హార్టికల్చర్ అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు. వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని,అలాగే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీలకు రూ.12వేలు బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలని, నష్టపోయిన రైతుకలు రూ.25వేలు నష్టపరిహారం అందించాలని, అదేవిధంగా రైతు భరోసా ద్వారా రూ.15వేలు రైతులకు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ,పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, చావా కిరణ్ యల్లారావుగౌడ్, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి కాసాని సీతారామయ్య, వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, .నాగేశ్వరరవు, మంద సరస్వతి పాల్గొన్నారు.

పూర్తికాని రేషన్ కార్డుల కేవైసీ

- జిల్లాలో 84.77శాతం మాత్రమే పూర్తి
- వేలిముద్రలు అరిగిపోవడంతో వృద్ధుల విషయంలో సమస్య
- రేషన్ రాదేమోనని ఆందోళన
- ప్రత్యామ్నాయ చర్యల కోసం వినతి



మధిర, ఏప్రిల్ 5: బోగస్ కార్డుల ఏరివేతకు చేపట్టిన రేషన్ కార్డుల కేవైసీ ప్రక్రియ గడువు మార్చి 31తో ముగిసింది. అయినా ఖమ్మం జిల్లాలో 84.77శాతానికి మించి కేవైసీ ప్రక్రియ పూర్తికాని పరిస్థితి నెలకొంది. చాలా మంది వయస్సు పైబడిన వృద్ధుల చేతి వేళ్ల అరిగిపోవడంతో చేతి వేళ్ల గీతలు మిషన్‌లో పడటంలేదు. చూపు మందగించడంతో కంటి చూపుకు స్పందన రావడంలేదు. కొందరు వృద్ధులు వయోభారంతో బైటకు రాలేని పరిస్థితి. 5శాతం మంది దూరప్రాంతాల్లో ఉంటున్న పిల్లలు, వివాహాలై ఇతర ప్రాంతాలకెళ్లినవారి కేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు.

జాబితాలో కొందరు చనిపోయినవారి పేర్లు తొలగించాల్సి ఉంది. కొందరి ఆధార్ కార్డులు నెంబర్లు మారడంతో సరిపోవడం లేదని తెలుపుతున్నారు. చిన్నపిల్లల చేతి వేళ్ల కొంతమందివి పడటంలేదని డీలర్లు చెబుతున్నారు. వీరంతా ఏంచేయాలో తెలియక తమకు రేషన్ బందు అవుతుందేమోననే ఆందోళన చెందుతున్నారు. రేషన్ దుకాణాల్లో బోగస్ కార్డులతో పాటు మరణించిన వారిపేర్లు, వివాహాలు చేసుకొని వెళ్లిన ఆడపిల్లలు పేర్లు తొలగించకుండానే బియ్యం తీసుకుంటున్నపరిస్థితి ప్రస్తుతం కొనసాగుతుంది. దీన్ని సరిచేసి బోగస్ ఏరి వేయాలని గత ఏడాది సెప్టెంబరులో ప్రభుత్వం ఈ కేవైసీ ప్రక్రియను చేపట్టింది. గత 7నెలలుగా లబ్దిదారుల వివరాలతో పాటు వేలిముద్రలను మరోసారి సేకరిస్తున్నారు. వాస్తవానికి జనవరి 31తో గడువు ముగిసినా మార్చి 31వరకు ప్రభుత్వం పొడిగించింది.

కేవైసీ పూర్తయిన వివరాలివే...

ఖమ్మం జిల్లాలోని 21మండలాల్లో మొత్తంగా అన్ని స్కీంలకు కలిసి 4,11,315 కార్డులుండగా 11,32,871 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 9,59,137 మంది లబ్ధిదారులు అంటే 84.77శాతం కేవైసీ పూర్తి అయింది. వీటిలో ఎన్ఎఫ్ఎస్‌సీ స్కీంలో 2,32,251కార్డులుంటే 7,26,865 మంది కార్డుదారులున్నారు. గడువులోపు 6,44,864 మంది 88.72శాతం కేవైసీ పూర్తిఅయింది. ఎస్ఎఫ్ఎస్‌సీ స్కీంలో 1,79,064 కార్డులుండగా 4,04,622 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 3,14,273 మంది లబ్ధిదారులు 77.67 శాతం మాత్రమే కేవైసీ చేయించారు. ఇక మిగిలిన వాటి కేవైసీ కావడంలేదు. మందకొడిగా సాగుతుందని తెలుపుతున్నారు. జిల్లాలో తల్లాడ మండలంతో అత్యధికంగా 89.21శాతం కేవైసీ పూర్తికాగా, కామేపల్లి మండలంలో అత్యల్పంగా 52.13 శాతం పూర్తిఅయింది.

మండలానికో 300మంది వృద్ధులు

ముఖ్యంగా వృద్ధుల విషయంలో వేలిముద్రలుకాకుండా ఇంకో ఆప్షన్ లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. వేలి ముద్రలు పడని వారికి మరో ఆప్షన్ ఇవ్వాలని, బయటకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి తీసుకొనే సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. ప్రతి మండలానికి 200నుంచి 300మంది వృద్ధులు వేలుముద్రలకు రాని వారు ఉంటారని తెలుస్తోంది. గతనెల 31తో గడువు ముగిసినందున కేవైసీ కాని కార్డుదారులకు భవిష్యత్‌లో రేషన్ బంద్ అవుతుందని తెలుస్తోంది. దూరప్రాంతాల్లోఉంటున్న వారికి రాష్ట్రంలో అయితే అక్కడే కేవైసీ చేసుకొనే వెసులుబాటు ఉంది. రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉంటున్న వారి విషయంలోనే కేవైసీలుపెండింగ్‌లో ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. గడువు ముగిసినందున ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని వేలిముద్రలు పడని, ఆధార్ కార్డులు ట్యాలీకాని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే ఏదైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది

రాష్ట్రానికి కరువు తెచ్చింది కేసీఆరే

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రానికి కరువు తీసుకొచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరువు తీసుకు వచ్చిందని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమని, కాంగ్రెస్ పార్టీ డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిందని, డిసెంబరులో వర్షాలు కురుస్తాయా అని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వర్షాకాలంలో వర్షాలు పడ్డాయి, ఆనీటిని సక్రమంగా సద్వినియోగం చేయక వృధాగా వదిలేయడంతోనే నీటి సమస్య తలెత్తిందన్నారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే పార్టీలో చేరే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నామని, ప్రజలు కోరుకుని తెచ్చుకున్న ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామని, కుట్రదారులకు బుద్ధి చెబుతామని తెలిపారు. కరెంట్ కష్టాలు లేకుండా చూడగలుగుతున్నామని, వేసవిలో విద్యుత్ కోతలు రానివబోమన్నారు. తుక్కుగూడలో శనివారం జరుగుతున్న బహిరంగసభలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు గ్యారంటీలు ప్రకటించబోతుందని, దేశ సంపదను పెంచిన పెంచిన సంపదను పేదల సంక్షేమంకు పంచే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టో హామీలు ఉండబోతున్నాయని ప్రకటించారు.

ముగిసిన ఉర్సు ఉత్సవం



ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 5: నగరంలోని శుక్రవారపేట హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షావలి బాబా ఉర్సు ఉత్సవం శుక్రవారం తో ముగిసింది. నగరంలోని తుమ్మలగడ్డ దర్గా సేవకుడు తాజ్‌బాబా ఇంటి నుంచి ఊరేగింపు మొదలై తుమ్మలగడ్డ మసీదు, మోమినాన పాఠశాల, శుక్రవారపేట సెంటర్, రిక్కాబజార్, శివాలయం మీదుగా దర్గాలోకి ఊరేగింపుగా చేరారు. మతపెద్దలు, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో హిందు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వనజీవి రామయ్య

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 5: నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతంలో ఉన్న బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావుతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా వినోదరావు మాట్లాడుతూ 84 ఏళ్ల వయస్సులో కూడానమ్మిన సిద్ధాంతానికి పచ్చని బాట వేస్తున్న వనజీవి ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ భర్త రిమాండ్

రఘునాథపాలెం, ఏప్రిల్ 5: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలను దుర్వినియోగం చేసి, విక్రయించిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ భర్తను రఘునాథపాలెం తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు రిమాండ్‌కు పంపారు. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల మేరకు.. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామంలో నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. ఆదే గ్రామానికి మాజీ సర్పంచ్ భర్త కాంపాటి రవి ఇళ్ల పట్టాలు పొందిన వారిని బెదిరించి, బలవంతంగా తక్కువ ధరలకు కొనుగోలు చేశాడని తహసీల్దార్ లూదర్‌విల్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇతరులకు ఎక్కువ ధరలకు అమ్మాడని, ఆక్రమంగా స్థలాలను ఆక్రమించుకున్నాడని పేర్కొన్నారు. దీంతో గత వారం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కాంపాటి రవిని రిమాండ్‌కు పంపారు.

గ్రానైట్ బ్లాకులకు ఐదు రోజుల వ్యాలిడిటీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 5: 'గ్రానైట్ క్వారీల నిర్వహణ గుదిబండేనా' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కాగా.. మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. వెంటనే 50 మీటర్లలోపు గ్రానైట్ బ్లాకులకు 5 రోజుల వ్యాలిడిటీతో ఆన్‌లైన్ పర్మిట్లను శుక్రవారం రాత్రి నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో జిల్లాలోని పలువురు గ్రానైట్ క్వారీ యజమానులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆన్‌లైన్లో ఉంచిన 5 రోజుల వ్యాలిడిటీ వాస్తవానికి సరిపోదని తెలిసినా కొందరు అధికారులు నిర్ణయంతో ప్రభుత్వం ఇలా సరిచేసిందని తెలిసింది. వర్షాకాలంలో అధిక వర్షాలు పడే సమయంలో ఈ ఐదు రోజుల వ్యాలిడిటీ ఏంత మాత్రం సరిపోకున్నా ఎలా ఆన్‌లైన్లో ఉంచారో తెలియని పరిస్థితి. కాగా శుక్రవారం రాత్రి అందుబాటులోకి వచ్చిన పర్మిట్లతో 10మంది క్వారీ యజమానులు పర్మిట్లను ఆన్‌లైన్లో తీసుకున్నారు. కాగా వీరందరికి 5రోజులు వ్యాలిడిటీనే వచ్చింది. 50మీటర్లకు మించి ఆన్‌లైన్ పర్మిట్లకు ఎవరూ దరఖాస్తు చేయలేదు.

వికాస తరంగిణి ద్వారా వైద్యసేవలు

దమ్మపేట, ఏప్రిల్ 5: వికాస తరంగిణి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలోని ఎమ్మెల్యే ఆదినారాయణ నివాసానికి శుక్రవారం రాత్రి చిన జీయర్‌స్వామి వచ్చారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆదినారాయణ నివాసానికి వచ్చిన చిన జీయర్‌స్వామికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ వికాస తరంగిణీ ద్వారా మహిళా వికాస ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టామని, ఇప్పటివరకు 26లక్షల మందికి వైద్య పరీక్షలు చేయించామన్నారు.


ఆదర్శ పాలన అందించిన బీఆర్‌ఎస్

- ఖమ్మం లోక్ సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



ప్రసంగిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

సత్తుపల్లి/ వైరా, ఏప్రిల్ 5: దేశానికే ఆదర్శ పాలనను కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రజలకు అందించిందని బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో పట్టణ, రూరల్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం, వైరా బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల సందర్భంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు 420హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసంచేసిన తీరు ఓటర్లను కలిసిన సందర్భంలో వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో తన విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ గత ఎన్నికలలో అధికారమే లక్ష్యంగా అలవికాని హామీలను ఇచ్చిందని, ప్రస్తుతం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 110రోజుల్లోనే తాము మోసపోయామని ప్రజలు గ్రహించారని అన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని పరిస్థితుల్లో ఉందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఒకపక్క సాగునీరు లేక వరినాట్లు కూడా వేయలేని పరిస్థితి ఉంటే మరోపక్క అష్టకష్టాలు పడి రైతులు పండించిన వరిధాన్యం కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన వరికి రూ.500బోనస్ ఇవ్వాల్సి వస్తుందని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ అక్కడ ధాన్యం కొనడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తాగునీరు, సాగునీరు సమస్య విస్తృతంగా పెరిగిందని, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు మళ్లీ వస్తున్నాయని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు విమర్శించారు.


మాట్లాడుతున్న సండ్ర

సత్తుపల్లి సమావేశంలోరాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్, బాణోతు మదన్‌లాల్, జడ్పీటీసీలు కూసంపూడి రామారావు, నంబూరి కనకదుర్గ, మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశంలో హెచ్‌ఎం

- కోడ్ ఉల్లంఘనేనని సి-విజిల్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



వైరా, ఏప్రిల్ 5: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వైరాలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఆ పార్టీ నేతలు పాల్గొన్న సమావేశానికి ఓ ప్రధానోపాధ్యాయుడు హాజరుకావడం వివాదాస్పదంగా మారింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సీపీఎస్(గుట్టబడి) ప్రధానోపాధ్యాయుడు నాగబత్తిని భాస్కర్‌రావు ఈ సమావేశంలో పాల్గొని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసిమెలిసి తిరిగారు. ఎంపీ నామా ప్రసంగించిన సమయంలో భాస్కర్‌రావు కార్యకర్తలతో కూర్చొని ప్రసంగం అయిపోయేవరకు విన్నారు. హెచ్‌ఎం తీరుపై సి-విజిల్, ఇంటిలిజెన్స్, ఇతర నిఘా వర్గాల ద్వారా ఫిర్యాదులు అందడంతో జిల్లా కలెక్టర్ గౌతమ్ స్పందించి విచారణ కోసం డీఈవో సోమశేఖరశర్మను ఆదేశించారు. వెంటనే వైరా ఎంఈవోకు డీఈవో ఆదేశాలు జారీ చేసి నివేదిక తెప్పించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు బీఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొన్నట్లు ధ్రువీకరిస్తూ ఎంఈవో నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై భాస్కర్‌రావును వివరణ కోరగా తమ పాఠశాలకు సౌకర్యాలు కల్పించమని కోరేందుకుగానూ వైరా వచ్చిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసేందుకు అక్కడకు వెళ్లానని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు బల్లలు ఇవ్వాలని, సురక్షిత తాగునీరు అందించాలని వినతిపత్రం ఇచ్చేందుకు అక్కడ వేచి ఉన్నానని పేర్కొన్నారు.

ఒడిదొడుకుల వ్యవసాయం

(3వ పేజీ తరువాయి)

పంటలు పండే జిల్లాలో కేవలం రైతాంగం ఒకేపంటకు పరిమితం కావాల్సి వస్తోంది. వేసవి రాగానే పొలాలన్నీ బీళ్లుగా మారి వెలవెలబోతున్నాయి. తొలకరిలో వర్షం కురిస్తేనే సాగు అన్నట్టుగా జిల్లా వ్యవసాయ రంగం సాగుతుంది.

జీవనది ప్రవహిస్తున్నా..

ఉమ్మడి జిల్లాకు ఉత్తరాన గోదావరి నది ప్రవహిస్తోంది. ప్రతి ఏటా లక్షల క్యూసెక్కుల వరద సముద్రంపాలవుతుంది. పినపాక నుంచి భద్రాచలం వరకు గోదావరి పయనం సాగుతున్నా ఆ జలాలు సాగునీటి రంగానికి ఉపయోగపడని పరిస్థితి. అక్కడక్కడ మోటర్లు, లిఫ్టులతో కొద్దిపాటి నీటినే వినియోగించుకుని నదీ పరీవాహక ప్రాంత రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. దశాబ్దాల కాలంగా గోదావరి జలాల కోసం ఉమ్మడి జిల్లా రైతాంగం ఎదురు చూస్తోంది. జిల్లాకు ఖమ్మం మెట్టప్రాంతంలో సాగర్ ఎడమ కాల్వ రాకతో వర్షాకాలం పంటలకు ఢోకా లేకుండా సాగుతుండగా వేసవిలో మత్రం సాగర్ నీటి నిల్వను బట్టి పంటలు పండుతున్నాయి. సాగర్ జలాలు ఖమ్మం, పాలేరు,సత్తుపల్లి, వైరా, మధిర నియోజవర్గాలకు కొంత భరోసా కల్పిస్తుండగా గోదావరి జలాలు మాత్రం మిగిలిన నియోజకవర్గాలకు ఏమాత్రం ఉపయోగపడని పరిస్థితి.

'సీతారామ'తోనే పరిష్కారం

ఉమ్మడి జిల్లా రైతాంగం సీతారామ సాగునీటి ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తోంది. సీతారామ పూర్తయితేనే సాగునీటి కష్టాలు తీరుతాయని రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. రూ.15వేల కోట్లతో ఏడేళ్ల క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన సీతారామప్రాజెక్టు నత్తనడకన నడుస్తోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో పర్యవేక్షణ, సమీక్షలు లేకపోవడంతోపాటు కరోనా కష్టకాలం రావడం, సీతారామ సాగునీటి ప్రాజెక్టు పనులకు ఆటంకాలు ఎదురపడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల సమీక్షలు చేపట్టారు. జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా సమీక్షలో పాల్గొని సీతారామ ప్రాజెక్టును సత్వరం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా సీతారామ నిధులు, పనులు సమస్య ను తీసుకెళ్లారు. సీతారామ పనుల్లో పురోగతి కనిపిస్తోంది.

వచ్చే ఏడాది పనుల్లో సీతారామ ద్వారా నీళ్ల కొంతవరకైనా అందిస్తామని మంత్రులు చేస్తున్న ప్రకటనలు రైతాంగంలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తయితే గోదావరి జలాలు పాలేరుకు తరలడంతో పాటు కృష్ణా, గోదావరి జలాలు అనుసంధానమయ్యే పరిస్థితి ఉంటుంది. కృష్ణా ఆయకట్టుకు కూడా గోదావరి జలాలు ఉపయోగపడనున్నాయి. జిల్లాలో పాలేరు, వైరా, లంకసాగర్, బేతుపల్లితో పాటు కిన్నెరసాని, బయ్యారం, మూకుమామిడి, తుమ్మలచెరువు వంటి పెద్ద చెరువులు, చిన్నచెరువుల్లో గోదావరి జలాలను నింపడం ద్వారా వానాకాలం, యాసంగి పంటల్లో రెండు పంటలు పండుతాయి. వేసవిలో వ్యవసాయ పంటలు వరి, వేరుశనగ, పెసర, మినుము వంటి పంటలు, కూరగాయల సాగు పెరిగి వ్యవసాయం కళకళలాడుతుంది.

కార్గో సర్వీస్ ద్వారా రామయ్య తలంబ్రాలు

- రూ.151 చెల్లిస్తే నేరుగా ఇంటికే పంపిణీ
- కొత్తగూడెం ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 5: భద్రాచలం శ్రీరామనవమి తలంబ్రాలు కావాల్సిన వారు ఆర్టీసీ కార్గో సర్వీస్‌లో బుక్‌చేసుకుంటే నేరుగా ఇంటికే తలంబ్రాలు అందజేస్తామని కొత్తగూడెం డీపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం డిపో ప్రాంగణంలో ఆర్టీసీ కార్గో ముత్యాలతలంబ్రాల పంపిణీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి తలంబ్రాల కోసం రూ.151లను చెల్లిస్తే తలంబ్రాలు నేరుగా ఇంటికే అందజేస్తామని డీఎం తెలిపారు. వివరాలకు 9154298599, 9154298600 ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సునీత, ఆర్ఆర్‌కె ప్రసాద్, చారీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.హనుమ, డిపో సిబ్బంది, లాజిస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలకు న్యాయం చేయాలి: పీవోడబ్ల్యూ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 5: చంద్రాయపాలెం ఘటనలో రోజుకు కొంతమంది దిని స్టేషన్‌కు పిలిచి కేసులలో ఇరికించేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పీవోడబ్ల్యూ భద్రాద్రి జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమా ప్రభుత్వాన్ని కోరారు. పోలీసుల దాడికి గురైన బుగ్గపాడులోని బాధిత కుటుంబాలను శుక్రవారం పీవోడబ్ల్యూ బృందం పరామర్శించింది. చంద్రాయపాలెం భూమి విషయంలో రెవెన్యూ శాఖ గతంలో పట్టాలిచ్చిందని, వీఎస్ఎస్ పేరుతో అటవీశాఖ ఆక్రమించుకుని సాగు చేసుకుంటుందన్నారు. పట్టాలున్న ఆదివాసీలు భూములు కావాలని అడిగితే అమాయక గిరిజనులపై దాడి చేసి కేసులు పెట్టారని ఆరోపించారు. మహిళలను చూడకుండా లాఠీచార్జీ చేయడం అమానుషమన్నారు. వారిపై పెట్టిన కేసులు ఎత్తివేసి పట్టాలు ఉన్న భూములను గిరిజనులకు ఇచ్చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సోమ వినోద, సరోజ, కాంతమ్మ, నాగలక్ష్మీ, చంద్రమ్మ పాల్గొన్నారు.

పదో తరగతి స్పాట్‌కు ఉగాది, రంజాన్ సెలవులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 5: ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్న పదో తరగతి స్పాట్ వ్యాల్యూయేషన్‌కు ఈ నెల 9న ఉగాది, 11న రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్టు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఈ స్పాట్‌ను ఈ నెల 13 తేది వరకు పొడిగించారని తెలిపారు. శుక్రవారం స్పాట్ కేంద్రాన్ని జిల్లా అబ్జర్వర్ పి మదన్‌మోహన్ (జేడీ సర్వీసెస్) సందర్శించారు. స్పాట్ జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఖర్చు పెట్టించారు.. బిల్లు మరిచారు..

- అసెంబ్లీ ఎన్నికల సమయంలో మౌలిక వసతుల పేరిట ఖర్చు
- ఓటర్లలో చైతన్యం నింపడానికి వాల్‌రైటింగ్
- నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయ తీలపై భారం


స్టేజీ పినపాక గోడలపై రాసిన వాల్‌రైటింగ్స్

వైరా, ఏప్రిల్ 5: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది చేసిన ఖర్చుల మొత్తాన్ని ఇంతవరకు చెల్లించకపోవడంతో అప్పులపాలై అలమటిస్తున్నారు. పై అధికారుల ఆదేశాలను కాదనలేక అందినకాడికి అప్పులు చేసి ఖర్చుపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల తంతు ముగిసి నాలుగునెలలైనప్పటికీ ఇంతవరకు పాత బకాయిల సొమ్ము చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మళ్లీ లోక్‌సభ ఎన్నికలు రావడంతో మళ్లీ అప్పుల ఊబిలో ఉన్న తమపైనే మళ్లీ ఖర్చుల భారాన్ని మోపుతారేమోనని హైరానా పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎక్కడా లేనివిధంగా ఖమ్మంజిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పేరిట హడావుడి చేశారు. ఉన్నతాధికారి ఆదేశాలతో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు హడావుడి చేసి క్షేత్రస్థాయిలోని సిబ్బందిపై భారాన్ని మోపారు. ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు గానూ పాఠశాలల ప్రహరీగోడలకు రంగులు వేయించి పలు నినాదాలతో వాల్‌రైటింగ్ రాయించి ముస్తాబు చేశారు. గత ప్రభుత్వంలో అమలైన మన ఊరు-మనబడి పథకం కింద అలాగే ఎస్‌డీఎఫ్ నిధులను పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కోసం వినియోగించాలని అధికారులు సూచించారు. అయితే ప్రభుత్వం నుంచి ఆ పథకాల గురించి ఇంతవరకు నిధులు రాలేదు. ఆయా పాఠశాలలకు రంగులు వేసి తాగునీటి సౌకర్యం, ర్యాంపు నిర్మాణం, కరెంట్ వైర్లు, ఫ్యాన్ల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు చేయించారు. అలాగే పోలింగ్ రోజు టెంట్లు, లైట్లు ఏర్పాటుచేయించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకుగానూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. అలాగే పోలింగ్ కోసం వచ్చిన అధికారులు, సిబ్బందికి, బందోబస్తుకు వచ్చిన పోలీసు ఇతరశాఖల సిబ్బందికి రెండురోజులు అల్పాహారం, భోజనం, టీ, స్నాక్స్ వంటివి ఏర్పాటుచేశారు. అయితే రెండురోజుల భోజనాలు, అల్పాహారం, టీకి సంబంధించి ఒక్కో పోలింగ్ కేంద్రానికి అడ్వాన్స్‌గా కేవలం రూ.800 చొప్పున మాత్రమే చెల్లించారు. ఇక మిగిలిన ఖర్చులు మొత్తాన్ని ఇంతవరకు ఇవ్వలేదు. మన ఊరు-మనబడి, ఎస్‌డీఎఫ్ నిధులు అందుబాటులో లేని వైరా మునిసిపాలిటీ సహా మండలంలోని అనేక గ్రామపంచాయ తీలవారు పంచాయతీ అధికారులు, సిబ్బంది లక్షలాదిరూపాయలు ఖర్చుచేసి మౌళిక వసతులు ఏర్పాటుచేశారు. ఇంతవరకు ఖర్చుల మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు. అయిన ఖర్చుల వివరాలతో ఇంజనీరింగ్ అధికారులు ఎంబీలు చేసినప్పటికీ పంచాయతీల నుంచి ఆనిధులను కార్యదర్శులు డ్రా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. జనవరి 31వతేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అయితే పంచాయతీల్లో నిధులు డ్రాచేసేందుకు స్పెషలాఫీసర్ల డిజిటల్ కీ ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. గతంలో ఉన్న మన ఊరు-మనబడి పథకం స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను అమలులోకి తీసుకువచ్చింది. ఈ పథకం కింద లోక్‌సభ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసిన పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించేందుకు కలెక్టర్ రూ.25వేల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఆనిధులతో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అయితే ఎన్నికల నిధుల వ్యయానికి సంబంధించి ఎలాంటి పారదర్శకత, జవాబుదారితనం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా పైస్థాయి అధికారి ఆదేశాలను ఎంత భారమైనా భరించి క్షేత్రస్థాయి సిబ్బంది అమలుచేయడం తప్ప వారిని ప్రశ్నించే పరిస్థితి లేకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా గతఅసెంబ్లీ ఎన్నికల సమయంలో అయిన ఖర్చుల మొత్తాన్ని చెల్లించి తమను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలని క్షేత్రస్థాయి సిబ్బంది వేడుకుంటున్నారు.



వైరా హైస్కూల్ ప్రహరీలపై వాల్‌రైటింగ్స్

మూతపడుతున్న గ్రానైట్ పరిశ్రమలు

- స్లాబ్ సిస్టంపై సబ్సిడీ ఎత్తివేత
- ఏడాదిగా అమ్ముడుపోని ఫినిషింగ్ మెటీరియల్
- ఆందోళనలో పరిశ్రమల యజమానులు



ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 5: గ్రానైట్ పరిశ్రమ రోజురోజుకు సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటుంది. ఒకప్పుడు ప్రపంచానికి గ్రానైట్‌ను పరిచయం చేసిన ఖమ్మం జిల్లాలోని పరిశ్రమ ప్రస్తుతం అనేక ఆటుపోటులను ఎదుర్కొంటుంది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. ప్రభుత్వం స్లాబ్ సిస్టంపై సబ్సిడీలు ఎత్తివేయటం, క్వారీల నిర్వహణపై ఆంక్షలు విధించడం వంటి పలు అంశాలు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణకు గుదిబండలా మారాయి. ఒకప్పుడు రోజుకు 24 గంటలు కార్మికులతో కళకళలాడే పరిశ్రమ నేడు రాత్రి పూట లైట్లు వెలగని పరిస్థితికి వచ్చింది. దీనికి ప్రధాన కారణం గ్రానైట్ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకప్పుడు ఎంతో మందికి ఉపాధి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిషా, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వచ్చి ఖమ్మంలో గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసేవారు. నేడు ఖమ్మంజిల్లాలోని కార్మికులకే పనిదొరకని పరిస్థితి ఏర్పడింది. గ్రానైట్ పరిశ్రమలకు గతంలో సబ్సిడీలు ప్రకటించిన ప్రభుత్వాలు నేడు ఒక్క రూపాయ సబ్సిడీ ఇచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. విద్యుత్ సబ్సిడీ, పావలా వడ్డీ, సేల్స్‌టాక్స్ సబ్సిడీతోపాటు వివిధ రకాల సబ్సిడీలు అందించి పరిశ్రను ఆదుకున్న ప్రభుత్వాలు నేడు ఆ దిశగా ఎందుకు ఆదుకోవటంలేదో అర్థంకాని పరిస్థితి.

జిల్లాలో ఒకప్పుడు 550 స్లాబ్ పరిశ్రమలు, 250 టైల్స్ పరిశ్రలతో కళకళలాడే ఖమ్మం నేడు ప్రభుత్వాల ఆంక్షలతో స్లాబ్ పరిశ్రమలు 300, టైల్స్ పరిశ్రమలు 70 వరకు నడుస్తున్నాయి. వాటిలో కూడ మరో 100 పరిశ్రల వరకు మూతపడే అవకాశం ఉంది. కాగా మూతపడిన పరిశ్రమలకు కొంద రు యజమానులు సంబందిత అధికారులకు స్టాప్ (పరిశ్రమ మూసివేస్తున్నాం) అని లెటర్లు అందిస్తే కరెంట్, రాయల్టీపై కొంత వెసులుబాటు అందిస్తారు. కాని ఎక్కువమంది ఆ పని చేయకపోవటంతో 4కటింగ్ మిషన్లు ఉన్న స్లాబ్ పరిశ్రమకు నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు కరెంట్ బిల్లు, రాయల్టీ నెలకు రూ.80 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఒక్కో పరిశ్రమ నెలకు రూ.లక్ష పరిశ్రమ మూసినా ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది.

ఆంక్షలు సడలిస్తే మళ్లీ పుంజుకునే అవకాశం

దీనికి తోడు పరిశ్రమ రాత్రి పగలు కాపాలాదారుడు తప్ప నిసరి ఇలా పరిశ్రమ నడిపినా, మూసినా ప్రస్తుత పరిస్థితుల్లో అప్పులు తప్ప మిగిలేది లేదని పలువురు పరిశ్రల యజమానులు వాపోతున్నారు. టైల్స్ పరిశ్రమకు అదే పరిస్థితి. ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతాల్లో, ముదిగొండ, ఆరెంపుల, పల్లెగుడెం, గోపాలపురం, ప్రకాష్‌నగర్, వైరా, లక్ష్మీపురం, ముదిగొండ ఖానాపురం, నేలకొండపల్లి తదితర ప్రాంతాల్లో గ్రానైట్ పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. వీటికి తోడు గ్రానైట్ క్వారీలు ఖమ్మంరూరల్, అర్బన్, ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం తదితరు మండలాల్లో గ్రానైట్ క్వారీల నిల్వలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వాల ఆంక్షలు వల్ల క్వారీల నిర్వహణ కష్టంగా మారింది.

ప్రభుత్వాలు చిన్న క్వారీల లీజుల విషయంలో కొన్ని ఆంక్షలు తొలగిస్తే మళ్లీ ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. హెక్టార్ (రెండున్నర ఎకరాలు) ప్రాంతంలో గ్రానైట్ క్వారీలకు ప్రభుత్వం ఆంక్షలు లేకుండ లీజులు ముంజూరు చేస్తే జిల్లాలో ఎక్కువగా గ్రానైట్ క్వారీలు నడిసే అవకాశం ఉంది.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం: సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 5: కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఖమ్మం సీపీ సునీల్‌దత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తసుకుంటున్నామన్నారు. మహిళలకు ప్రయాణాల్లో, పని ప్రదేశాల్లో , ఇతర చోట్ల ఎదురయ్యే వివిధ రకాల వేధింపుల నుంచి రక్షణ కోసం షీ టీమ్స్ బృందాలు అన్ని వేళలా అంటుబాటులో ఉంటున్నాయని తెలిపారు. ఫిర్యాదుల తీసుకోవడం మొదలు పరిష్కారం చూపే వరకు బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. బాదితులు నేరుగా షీటీమ్స్ బృందాలను కలిసి ఫిర్యాదుల చేయాల్సిన పనిలేదని, డయల్ 100 తదితర విధానాలలో కూడా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. ఒకవేళ నిందితుడు మైనర్ అయితే అతడికి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు షీటీమ్స్ 96 అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఇప్పటి వరకు 26మంది అమ్మాయిలు, మహిళలు కమిషనరేట్ షీటీమ్స్‌ను ఆశ్రయించగా, వేధించిన వారిని పట్టుకుని కొంతమందిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు. అదే విధంగా కొంతమందికి కౌన్సెలింగ్ చేసి బైండోవర్ చేశామన్నారు. మార్చిలో 9 ఫిర్యాదులు రాగా 4 పిట్టీకేసులు, ముగ్గరికి కౌన్సె లింగ్ నిర్వహించామని, అదేనెలలో 35 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కొద్దిరోజులుగా ఇంటర్, పది పరీక్షాకేంద్రాల వద్ద ద్విచ క్రవాహనంపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ అమ్మాయిలును ఈవ్‌టీజింగ్ చేస్తున్న ఆరుగురు ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మహిళలు వేధింపులకు గురైతే డయల్ 100లేదా 87112659222 నెంబరులో సమాచారం ఇవ్వాలని సీపీ తెలిపారు.

వైన్‌షాపుల్లో ఎక్సైజ్‌శాఖ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 5: ఖమ్మంనగరంలోని పలు మద్యం దుకాణాలను ఖమ్మం 1టౌన్ ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిబాబా ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. వైన్స్‌కు డిస్టలరీల నుంచి సరఫరా జరిగిన మద్యం అమ్మకాల తర్వాత మిగిలిన మద్యం నిలవలను తనిఖీ చేశారు. అలాగే వైన్స్‌లోని మద్యం బాటిల్స్‌పై ఉన్న కోడ్‌ను మొబైల్ యాప్‌లో స్కాన్ చేసి ఒరిజనల్ మద్యం వివరాలను గుర్తించారు. అలాగే శిక్షణకు వచ్చిన కానిస్టేబుల్స్‌కు వైన్స్ రికార్డుల పరిశీలనపై శిక్షణ ఇచ్చారు.

అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టివేత

దమ్మపేట, ఏప్రిల్ 4: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.42 లక్షల విలువైన మద్యాన్ని ఎఫ్ఎస్‌టీం పట్టుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. ఎఫ్ఎస్‌టీం అధికారి కృష్ణ తెలి పిన వివరాల ప్రకారం ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎఫ్ఎస్‌టీం, సిబ్బంది కలిసి దమ్మపేట మండలం గోపాలపురం గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకుని పరిశీలించగా 192లీటర్ల మద్యం, 24 బీర్లను స్వాదీనం చేసుకున్నారు. వీటిని అశ్వారావుపేట ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 5: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని కోనేరుబజారుకు బండి నాగరాజు(40) ఆర్థిక ఇబ్బందులు, అతిగా మద్యం సేవించటం వంటి కారణాలతో ఈనెల 3న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూనే నాగరాజు గురువారం రాత్రి మృతిచెందాడు. ఘటనపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

పెనుబల్లి, ఏప్రిల్ 5: ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన సూచిక బోర్డును ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన లంకపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. కొత్త లంకపల్లి గ్రామానికి చెందిన రావుల వెంకటేశ్వరరావు (25), పాశం దుర్గారావు ద్విచక్రవాహనంపై పెనుబల్లికి వెళ్లి పనులను పూర్తిచేసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా లంకపల్లి గ్రామం వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న సూచికల బోర్డును ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలకు, దుర్గారావుకు కాలు తెగిపోవడంతో ఇరువురిని పెనుబల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వరరావు మృతిచెందాడు. దుర్గారావు చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారపాకలో పోలీసుల కార్డన్‌సెర్చ్

● 25 ద్విచక్ర వాహనాల సీజ్

బూర్గంపాడు, ఏప్రిల్ 5: నేరాలు జరుగకుండా అదుపుచేయడానికే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్టు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల గాంధీనగర్ ఏరియాలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు సరైన పత్రాలు లేని 25ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే రూ.41వేల విలువ చేసే మద్యాన్ని పట్టుకున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సీఐ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు గ్రామాలలో తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టౌన్, ములకలపల్లి ఎస్‌ఐలు సుమన్, నాగభిక్షం, ఏసోబు, శ్రీనివాస్, స్వప్న, రాజమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ముదిగొండ, ఏప్రిల్ 5: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం ముదిగొండ మండలం వెంకటాపురం వద్ద చోటుచేసుకుంది. కోదాడకు చెందిన గుండు రవి(56)ఖమ్మంనుంచి కోదాడ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనాస్థలానికి చేరుకున్న ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురంలో మేకలచోరీ

కారేపల్లి ఏప్రిల్ 5: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మూడు మేకలను ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన ఏలూరి రామారావు అనేవ్యక్తికి చెందిన మేకలను తమ ఇంటిముందు కటేశాడు. అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మూడు మేకలను అపహరించక పోయారు. వాటివిలువ రూ.50వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు రామారావు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి ఇద్దరు వ్యక్తుల మృతి

ములకలపల్లి/పాల్వంచ, ఏప్రిల్ 5: తాటిచెట్టు పైనుంచి పడి ఓ గిరిజనుడు మృతి చెందిన సంఘటన ములకలపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. సాయిరాంపురం గ్రామానికి చెందిన బొగ్గు వెంకటేష్ (43) కల్లుగీత వృత్తిలో ఉన్నాడు. రోజులాగానే శుక్రవారం కూడా కల్లు గీసేందుకు తాటి చెట్టును ఎక్కాడు. అయితే చెట్టు ఎక్కుతున్న సమయంలో మోకు జారిపోవడంతో వెంకటేష్ చెట్టు పైనుంచి పడి దుర్మరణం పాలయ్యాడు. వెంకటేష్‌కు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోటమాలి మృతి

పాల్వంచ: తాడిచెట్టుపై నుంచి జారి పడి తోటమాలి మృతి చెందిన సంఘటన పాల్వంచలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెనుబల్లి మండలానికి చెందిన మడకం దేవ (40) పాల్వంచ మండలం రంగాపురంలోని ఓ రైతుకు చెందిన మామిడి తోటలో దేవ తోటమాలిగా పనిచేస్తున్నాడు. భార్య సోమమ్మ, ముగ్గురు పిల్లలతో కలిసి అదే తోటలో చిన్న పూరిగుడిసెలో నివసిస్తున్నారు. మధ్యాహ్నం మామిడి తోటలోకి కోతుల గుంపు రావడంతో వాటిని అక్కడి నుంచి తరిమేయడానికి మామిడి చెట్టుకు అనుకుని ఉన్న తాడిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలోనే అవి అతనిమీద మూకుమ్మడిగా దాడిచేశాయి. దీంతో అదుపుతప్పి చెట్టుపై నుంచి దేవ కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గమనించి తోట యజమానికి, పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ నిర్వహించారు. భార్య సోమమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



దమ్మపేట, ఏప్రిల్ 5: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌నుంచి నలుగురు వ్యక్తులు అశ్వారావుపేటలో జరిగే వివాహానికి కారులో వస్తున్నారు. మండలంలోని ముష్టిబండ వద్ద రహదారిపై కుక్కలు అడ్డుగా రావటంతో కారు వేగాన్ని ఒక్కసారిగా తగ్గించారు. ఇదే సమయంలో అశ్వారావుపేటకు చెందిన తేజ, మహేశ్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై పేటకు వస్తుండగా కారు ఆగిపోవటంతో ద్విచక్ర వాహనం కారును ఢీకొంది. ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన గల గోతిలో పడిపోయింది. అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే ద్విచక్ర వాహనం చాలా వరకు కాలిపోయింది. ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు కాగా అశ్వారావుపేట తరలించి చికిత్స అందించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

అనారోగ్యంతో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి


బ్రహ్మయ్య (ఫైల్)

తల్లాడ, ఏప్రిల్ 5: అనారోగ్యంతో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ మృతిచెందాడు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ కోసూరి బ్రహ్మయ్య(31) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. బ్రహ్మయ్యకు భార్య కీర్తన, తొమ్మిదినెలల కుమారుడు లిఖిత్ వర్ధన్ ఉన్నారు. పోలీసుశాఖలో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో 2020లో బ్రహ్మయ్య టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎనిమిదినెలల క్రితం తీవ్ర అనారోగ్యంతో బ్రహ్మయ్య ఎడమకాలు తొలగించారు. అయినా వ్యాధి తీవ్రం కావడంతో రెండునెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం బ్రహ్మయ్య భౌతికకాయాన్ని రిజర్వు ఇన్‌స్పెక్టర్లు జీవీ.రామారావు, పి.ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ఐ ఎం.శ్రీను సందర్శించి నివాళులర్పించారు. మృతుడి భార్య కీర్తనను, చిన్నారిని ఓదార్చారు. అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.20 వేలు తక్షణ సాయంగా అందజేశారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో మహిళకు టోకరా

పాల్వంచ, ఏప్రిల్ 5: ఇంటి వద్ద నుంచే పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ డబ్బులు సంపాదించవచ్చనే మాటలను నమ్మి ఓ మహిళ మోసపోయింది. పాల్వంచ ఇందిరాకాలనీకి చెందిన షేక్ నస్రీమ్ వాట్సాప్‌లో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేసింది. ఇంటి వద్ద నుంచే పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వచ్చిన ఆ లింక్‌ను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఆమె అమాయకత్వానికి గాలం వేశారు. స్టార్ హోటల్స్‌కు రేటింగ్స్ ఇస్తే చాలు ప్రతి రోజు రూ.600 చొప్పున జీతం ఇస్తామని ఆమెను నమ్మించారు. కొద్ది రోజుల తర్వాత తమ కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తే నెలకు రూ.లక్షా ముప్పై వేలు వస్తాయని నమ్మబలికారు. దీంతో వారి మాటలు నమ్మి ఆమె పలు దఫాల్లో రూ. 62 వేలు వారి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. అప్పటినుంచి నగదు కోసం ఎదురుచూస్తున్న ఆమెకు రూ.లక్ష ఫోన్‌పేలో పంపినట్లు నేరగాళ్లు స్క్రీన్ షాట్ పంపారు. కానీ ఆమె అకౌంట్‌లో డబ్బులు జమ కాక పోవడంతో ఆమెకు అనుమానం వచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సెగ్మెంట్ల వారీగా ఈవీఎంల పంపిణీ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 5: త్వరలో నిర్వహించనున్న ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకోసం ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ చేపట్టిన తర్వాత అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఈవీఎం లను స్ట్రాంగ్ రూమ్‌కు రవాణా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరచారు. ఖమ్మం, పాలేరు సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, వైరా సెగ్మెంట్‌కు సంబంధించి వైరా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, మధిర సెగ్మెంట్‌కు సంబంధించి మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సత్తుపల్లి సెగ్మెంట్‌కు సంబంధించి జ్యోతి విద్యాలయం లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

కార్యకర్తల మనోభావాలను ఏనాడైనా గుర్తించారా?

- సత్తుపల్లి బీఆర్ఎస్ సమావేశంలో మండల నాయకుల ఆవేదన
- క్షేత్రస్థాయిలో జరిగేది చెప్పినా నాయకత్వం పట్టించుకోలేదు
- సంస్థాగత లోపం ఉంది: తాతా మధు


మాట్లాడుతున్న రామారావు

సత్తుపల్లి, ఏప్రిల్5: ఎన్నికలు వచ్చినప్పుడు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు గుర్తు వస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు మాత్రం కనీసం గ్రామ, మండల నాయకత్వాన్ని పట్టించుకోలేదని పలువురు నాయకులు సత్తుపల్లి పట్టణ, మండల బీఆర్ఎస్ సమావేశంలో జిల్లా నాయకత్వాన్ని నిలదీశారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల సమావేశం నిర్వహించగా బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు సహా ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు మాట్లాడుతూ ఏనాడైనా మండల స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో జిల్లా నాయకత్వం సమావేశం అయిందా అంటూ ప్రశ్నించారు. తాతా మధుకు కూడా తాను సూచించానని, అయినా ఆయన కూడా పెడచెవిన పెట్టారని అన్నారు. ఇతర పార్టీల నుంచి నాయకులను తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నారని, అందుకే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ సత్తుపల్లి మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమి అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలో మాత్రమే సమీక్షా సమావేశాలు జరిగాయని, ఇతర నియోజకవర్గాలలో ఎక్కడా జరగలేదని అన్నారు. కనీసం మంత్రిగా పనిచేసిన పువ్వాడ అజయ్ నియోజకవర్గంలో కూడా ఈ రోజుకు కార్యకర్తల సమావేశాలు పెట్టలేదన్నారు. ఒక్క సత్తుపల్లి నియోజకవర్గంలో సమావేశాలు పెట్టడం వలన నామా గెలుపు ఏ మేరకు సాధ్యమని ప్రశ్నించారు. తుంబూరుకు చెందిన నాయకుడు బంగారావుశర్మ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం బీసీ రుణాలు మంజూరు చేయడం వలన అవి అందరికీ అందక నష్టం జరిగిందన్నారు. అగ్ర నాయకులు సమావేశాలు పెట్టి వెళ్లిపోతే గ్రామాల్లో కేడర్ గతంలో మాదిరిగా ఆస్తులు అమ్ముకుని పనిచేసే పరిస్థితి లేదన్నారు.

సంస్థాగతంగా నిర్మాణంలో లోపం ఉంది: తాతా

సమావేశంలో పలువురు వ్యక్తంచేసిన అభిప్రాయాలతో తాను ఏకీభవిస్తున్నానని జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు అన్నారు. పార్టీ సమావేశాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా సంస్థాగత నిర్మాణంలోనే లోపం ఉందన్నారు. నియోజకవర్గాలలో ఎవరు పని చేస్తున్నారనే విషయం తన వద్ద సమాధానం లేదన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారే ప్రజానాయకుడు అన్నారు.

'అటవీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలి'

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 5: క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా అటవీశాఖ బీట్ అధికారులు జిల్లా అటవీశాఖ అధికారి శ్రీకిష్ణగౌడ్‌ను కోరారు. మంగళవారం పాల్వంచ డివిజన్ పరిధిలోని ములకపల్లి ఫారెస్టు బీట్ అధికారి పూర్ణపై కొందరు దాడి చేసిన సంఘటనను నిరసించారు. ఈ సందర్భంగా వారు దాడికి దారితీసిన పరిస్థితులను వివరించారు. దాడిలో గాయపడిన పూరకు వైద్య ఖర్చులు ప్రభుత్వ భరించాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారికి భరోసా కల్పించాలని కోరారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సంఘటన తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని డీఎఫ్‌వో వారికి హామీ ఇచ్చారు. డీఎఫ్‌వోను కలిసిన వారిలో రామకృష్ణ, భాగ్య, గోవిందు, కిషన్, శోభన్, నరేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

జయంతి కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు

పలు చోట్ల వేడుకల నిర్వహణ

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 5: భారతీయ సమాజానికి బాబుజగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువ లేనివని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇల్లెందు, మణుగూరు సీఐలు కరుణాకర్, సతీష్, ఆర్ఐలు రవి, సుధాకర్, కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అసమానతలులేని సమాజ నిర్మాణానికి..

అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం శ్రమించిన మహనీయుడు దివంగత భారత ఉపప్రధాన మంత్రి బాబుజగ్జీవన్‌రామ్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల సందర్భంగా శుక్రవారం శేషగిరిభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం బాబుజగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, దుగ్గిరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాల్వంచ టౌన్..

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి ఉప ప్రధాని బాబుజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కమీషనర్ ఎ. స్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అలుపెరగని పోరాట యోధుడు జగ్జీవన్‌రామ్

భద్రాచలం: దేశ స్వాతంత్ర్యం కోసం సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి, దేశ మాజీ ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజు అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటంకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు నిర్వహించగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కోట దేవదానం పాల్గొని నివాళ్లర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

వరికోతలు ప్రారంభం

నేటికీ ఏర్పాటు చేయని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు

పట్టించుకోని అధికారులు.. అన్నదాత అవస్థలు



ధాన్యం రాసులుగా పోసిన రైతులు

కరకగూడెం, ఏప్రిల్ 5: మండలంలో రైతులు ఎండాకాలం పంటగా వరిని సాగు చేశారు. తాము పండించిన వరి కోత దశలోకి రావడంతో రైతులు యంత్రాలతో వరి కోతలను ముమ్మరం చేశారు. ఇటీవల వర్ష ప్రభావ మబ్బులు ఏర్పడంతో రైతులు ఆందోళనకు గురైనప్పటికీ వర్షాలు కురవక పోవడంతో రైతులు కొంత గాలి పీల్చుకున్నారు. వరి పొలాలపై తెగుళ్ల దాడితో రైతులు వేల రూపాయాల మందులు పిచికారి చేసి పంటను సాగు చేశారు. ధాన్యం పంటను కోస్తున్న నేటికీ ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దాంతో దళారులు రైతులు పండించిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. రైతులను నట్టేట ముంచుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

21 వేల ఎకరాలలో వరి పంటసాగు

నియోజకవర్గంలో రైతులు యాసంగి పంటగా వరి పంటను సూమారు 20 వేల ఎకరాలు సాగుచేశారు. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులు వేసిన అంచనా ప్రకారం.. కరకగూడెం మండలంలో 2800 ఎకరాలు, పినపాక మండలంలో 4000, మణుగూరు మండలంలో 2100, అశ్వాపురం మండలంలో 2700, బూర్గంపాడు మండలంలో 3500, గుండాల మండలంలో 400, ఆళ్ళపల్లి మండలంలో 300 ఎకరాలతో వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా పలు రకాల సీడ్ పంటలు సుమారు 5000 వేల ఎకరాల పంటలతో కలిపి సుమారు 21 వేల ఎకరాలు వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. నియోజక వర్గంలో ఇప్పటికే ధాన్యం కోతలు ముమ్మరంగా అవుతున్నాయి. మండలంలో రైతులు వరి కోతలను ముమ్మరం చేసి వారం రోజులు గడుస్తున్న మండలంలో నేటికి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

కోటి గోటి తలంబ్రాల సమర్పణ



తలంబ్రాలు సమర్పించేందుకు వచ్చిన భక్త బృందం

భద్రాచలం, ఏప్రిల్ 5: ఈ నెల 17న జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి కోటిగోటి తలంబ్రాలను శుక్రవారం భక్తరామదాసు భక్త మండలి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామస్థులు సమర్పించారు. కోలాటం, నృత్యాలు రామనామ స్మరణలతో కోటి తలంబ్రాలను తీసుకువచ్చి స్వామి వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో రాముల వారిని దర్శనం చేసుకున్నారు. గోటి తలంబ్రాలతో ఇక్కడకు రావడం తమకు చాలా ఆనందంగా ఉందని భక్తబృందం పేర్కొంది.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

అశ్వాపురం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని మొండికుంటలో నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు మరింత సహకరించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆలయ నిర్మాణ ప్రాంగణంలో గ్రామస్థులు, భక్తులతో ఆలయ కమిటీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు, ఎన్ఆర్ఐలు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి నుంచి ఆశించిన స్పందన లభించిందన్నారు. భక్తుల నుంచి ఇప్పటి వరకు రూ.65లక్షల విరాళాలు ప్రకటించగా రూ.50లక్షలు జమయ్యాయని, వాటితో రూ.41 లక్షల పనులు నిర్వహించామన్నారు. పనుల్లో భాగంగా మండపం, విగ్రహాలు, ధ్వజస్తంభం, నవగ్రహాలు, సుదర్శనచక్రం, మకరతోరణం, దర్వాజాలు, రాముని కిరీటం సమకూర్చామని తెలిపారు. ఇంకా ఆలయం తాపడం, ప్రహరీ నిర్మాణానికి దాతలు సహకరించాలని, విరాళాలు ప్రకటించిన దాతలు వెంటనే చెల్లించాలని కోరారు. కాగా సమావేశం సందర్భంగా మల్లెలమడుగు గ్రామానికి చెందిన తెడ్డు ఆంజనేయులు రాముల వారికి వెండి కిరీటము అందజేయనున్నట్లు ప్రకటించారు. ఆలయ నిర్మాణ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మల్లారెడ్డి, ఎంపీటీసీ నరేష్, మాజీ ఉపసర్పంచ్ సుదీర్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విరాళాలు అందజేస్తున్న దాతలు


'ఉపాధి' బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ములకలపల్లి, ఏప్రిల్ 5: పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ బిల్లులు తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఉపాధి ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఎర్రటి ఎండలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధిహామీ చట్టానికి కొంత మేర బడ్జెట్ కేటాయించి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని, ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను విరమించుకోవాలన్నారు. వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ లేకుండా చేస్తుందని ఆరోపించారు. పని ప్రాంతాల్లో ఎండ తీవ్రతకు ఉపాధి హామీ కూలీలు మృతి చెందితే వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రాంతంలో టెంటు, మెడికల్ కిట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఉపాధి హామీ కార్మికులందరికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల కార్యదర్శి మాలోత్ రావుజ, మండల నాయకులు భూక్యా సామిని, సీతారాములు, ఆమల, సిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్స్ వివరాలను అందుబాటులో ఉంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం బసవయ్య

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 5: సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో ఖాళీగా ఉన్న క్వార్టర్స్ వివరాలను అందుబాటులో ఉంచాలని సింగరేణి జనరల్ మేనేజరు (పర్సనల్) కె.బసవయ్య ఆదేశించారు. శుక్రవారం వివిధ ఏరియాల పర్సనల్ అండ్ ఎస్టేట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న క్వార్టర్స్ వివరాలు, ఉద్యోగులు, కార్మికులకు కేటాయించిన క్వార్టర్స్ వివరాలు, ఖాళీగా ఉన్న క్వార్టర్స్ వివరాలను అందుబాటులో ఉంచాలని, రిటైర్డ్ అయిన కార్మికులు క్వార్టర్స్‌ను సింగరేణికి అప్పచెప్తే బెనిఫిట్స్‌ను సైతం వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఐటీ) రాంకుమార్, ఏజీఎం పర్సనల్ కె.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ. మోహన్‌రావు, ఎస్టేట్ మేనేజరు హిర్యా తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పర్సును అందజేస్తున్న నాయకులు

అశ్వాపురం, ఏప్రిల్ 5: అశ్వాపురానికి చెందిన చల్లగుండ్ల వెంకన్న అనే ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. మండల పరిధిలోని కుర్సంవారి గూడెంకు చెందిన కుంజా సులోచన శుక్రవారం వెంకన్న ఆటోఎక్కింది. గమ్యస్థానం చేరిన తర్వాత ఆటోలో తనపర్సును మరిచిపోయింది. పర్సు తెరిచి చూడగా దానిలో కొంత నగదుతో పాటు ఆధార్ కార్డు లభించింది. కార్డు ఆధారంగా ఆటో యూనియన్ నాయకులు బాధితురాలికి పర్సు అందజేశారు. డ్రైవర్ నిజాయితీని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమణయ్య, రాంబాబు, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఎస్పీ రోహిత్ రాజు సన్మానం

కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వివిధ సంఘటనల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను కాపాడిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల కాలంలో ఇల్లెందు పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేసి అతని ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ నాగరాజును, మణుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాయిగూడెం వద్ద గల గోదావరి నదిలో హోలీ రోజున ఈతకు వెళ్లి సుడిగుండంలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను కాపాడిన కానిస్టేబుళ్ల సత్యనారాయణ, వినయ్‌లను, డయల్ 100 ఫోన్ రాగానే తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడి సీపీఆర్ ద్వారా అతని ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ వీరా, హోంగార్డు కృష్ణలను ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పని చేస్తూ నిత్యం విధులు నిర్వర్తించడమే కాకుండా ప్రజల ప్రాణాలను స్వయంగా కాపాడటంలో సమయస్ఫూర్తిని, ధైర్య సాహసాలను ప్రదర్శించి ప్రాణాలను కాపాడటం గొప్ప విషయమన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది అందరికి గతంలో సీపీఆర్, ప్రథమ చికిత్సలపై అందించిన శిక్షణ మూలంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలను కాపాడటం సులువవుతుందని తెలిపారు. తోటి వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వారిని మనం కాపాడే విధంగా ప్రతి ఒక్కరు ప్రాథమిక జ్ఞానాన్ని కలిగి ఉండాలని ఎస్పీ తెలిపారు. అన్ని రంగాల్లో నిష్ణాతులుగా ఉండాలని సూచించారు.



కానిస్టేబుళ్లతో ఎస్పీ రోహిత్ రాజు

శుభకార్యాలు, పరామర్శలతో 'పాయం' బిజీ..బిజీ..

మణుగూరుటౌన్/పినపాక, ఏప్రిల్ 5: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రెండు రోజులుగా శుభకార్యాలు.. పరామర్శలు.. సంతాపాలతో బిజీ.. బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మణుగూరు సబ్ డివిజనల్‌లో మణుగూరు, పీవీ కాలనీతోపాటు పినపాక, బూర్గంపాడు మండలాల్లో జరిగిన పలు శుభాకార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన నర్సింహరత్నం రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు క్షతగాత్రుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బడే సంతోష్ కొద్ది రోజుల క్రితం పాముకాటుకు గురై వైద్య చికిత్సల అనంతరం కోలుకోగా ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే సంతోష్‌ను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

పినపాక మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహిస్తున్న జంపన్న దేవుడి జాతర మహోత్సవ వేడుకల్లో శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జంపన్న దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖః శాంతులతో ఉండాలని ఈ సందర్భంగా దేవుడిని మొక్కుకున్నారు. అందరూ ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మణుగూరులో వధూవరులను ఆశీర్వదిస్తున్న పాయం

నేటినుంచి ముత్యాలమ్మ జాతర

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని వినాయకపురంలో గల ప్రసిద్ధ చిలకలగండి ముత్యాలమ్మ ఆలయ జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. ఐదు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరగనున్నాయి. ఎంతో ప్రసిద్ధి చెంది గిరిజన జాతరగా పేరు పొందిన వినాయకపురం జాతరకు దాదాపు లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. ప్రతి రోజూ అమ్మ వారిని ఒక రూపంలో అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేయనున్నారు. జాతర నేపథ్యంలో దేవాదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. జాతర ఏర్పాట్లను శుక్రవారం సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీరాముల శ్రీను పరిశీలించారు. ఆలయంలో పూజలు చేశారు.

జన జాతర బహిరంగ సభను జయప్రదం చేయాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్

కరకగూడెం, ఏప్రిల్ 5: హైదరాబాద్ తుక్కుగూడలో శనివారం జరగనున్న జన జాతర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం హైదరాబాద్ తుక్కుగూడలో జరగనున్న జన జాతర భారీ బహిరంగ సభకు మండలం నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోకాళ్ల పాపారావు, కొమరం సురేష్, జలగం కృష్ణ, అత్తె సారయ్య, పూజారి వెంకన్న, ఎల్లబోయిన సత్యం, కరకపల్లి నాగేష్, భూక్య రాందాస్, కోరగట్ల విశ్వనాథం, సలుగు భిక్షపతి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి



రామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి మాధవి

భద్రాచలం, ఏప్రిల్ 5: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవిదేవి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దేవస్థానం నిత్యన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన వేమూరి శ్రీరామచంద్రమూర్తి, లలిత దంపతులు రూ.1,08,009, సంగారెడ్డికి చెందిన అప్పికట్ల శ్రీరాములు, గీత దంపతులు రూ.50 వేలు అందజేశారు.

పర్ణశాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

దుమ్ముగూడెం: పర్ణశాల రామాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి టి. మాధవి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపు కుటీరాన్ని సందర్శించి స్థల పురాణాన్ని తెలుసుకున్నారు. నారచీరల ప్రాంతాన్ని సందర్శించారు.

వెంకటేశుడికి వైభవంగా చక్రస్నానం

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 5: పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాసగిరి (గుట్ట) వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణం అనంతరం శుక్రవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా భక్తాంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఆరుట్ల ఫణిరాజా చార్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా చేపట్టారు. వసంతోత్సవం సందర్భంగా ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుని భక్తిపారవశ్యం చెందారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, ఓం ప్రకాష్, రమేష్, సందీప్, ధర్మపురి రాము, మహిళాకమిటీ, సేవా దళ్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

అడవి బిడ్డలను ఆదరించడం ఎంతో అదృష్టం

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 5: అడవి బిడ్డలను ఆదరించడం ఎంతో అదృష్టంగా ఉందని.. మీకు అండగా నేనున్నానని ఐసీడీఎస్ సీడీపీవో రేవతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గట్టుమళ్ల గ్రామపంచాయతీ క్రాంతినగర్ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, చిన్నారులు పౌష్టికాహార సమస్యలను అధిగమించాలని సూచించారు. గంగమ్మకాలనీలో ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు బానోత్ జ్యోతి సహకారంతో ప్రభుత్వపరంగా అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందచేశారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం, గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న ఆరోగ్య సలహాలు, సూచనలు, పాటించాల్సిన నిబంధనలను అడిగి తెలుసుకున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో వలస వచ్చిన గొత్తికోయ పిల్లల కోసం అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు బానోత్ జ్యోతి క్రమం తప్పకుండ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రాంతినగర్ ప్రాంతంలో తమకు అంగన్‌వాడీ కేంద్రాన్ని కేటాయించాలని, తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ సౌకర్యాలను కల్పించాలని సీడీపీవో ఎదుట గిరిజనులు వాపోయారు. పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, త్వరలో సాగునీటి సౌకర్యం కల్పిస్తానని సీడీపీవో రేవతి హామీ ఇచ్చారు.



పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీవో రేవతి

దివ్యాంగుల పాఠశాలకు వితరణ

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 5: పాల్వంచ కాంట్రాక్టర్స్ కాలనీలో గల డెఫ్ అండ్ డం (చెవిటి, మూగ) దివ్యాంగుల పాఠశాలకు ఆదర్శ మహిళాసంఘం ఆధ్వర్యంలో కూలర్, వాటర్ ప్యూ రిఫైడ్‌ను శుక్రవారం వితరణగా అందచేశారు. ఈ సందర్భంగా ఆదర్శ మహిళా సంఘం ఫౌండర్ కంచర్ల విమల మాట్లాడుతూ కొంతమంది స్నేహితులం కలిసి ఆదర్శ మహిళా సేవా సంఘం ఏర్పాటు చేసుకుని మాకున్నంతలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. గ్రూపుగా ఏర్పడిన సంవత్సరకాలంలో ప్రతి మూడు నెలలకు ఒక కార్యక్రమం చేపడుతూ ఇది నాల్గో కార్యక్రమంగా ఈ పాఠశాలకు వితరణగా కూలర్, వాటర్ ప్యూరిఫైడ్ అందచేశామన్నారు. ఇంకొంతమంది స్నేహితులు కలిసి దివ్యాంగ విద్యార్థులకు చాక్లేట్లు, బిస్కేట్లు కూడా అందచేశారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, ప్రకాష్, శివపార్వతి, రోజాలక్ష్మి, లక్ష్మి ప్రసన్న, అనసూయ, నాగ, ఇందిర, దుర్గ, పావని పాల్గొన్నారు.